క్లుప్తంగా

సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలు



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి (మహారాణిపేటలో గల అంబికాబాగ్ రామాలయం) ఆలయంలో స్వామి వార్షిక ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవ సంకల్పం, ధ్వజారోహణం, అంకురార్పణ నిర్వహించారు. ఈ నేపథ్యంలో 6వ తేదీ నుండి 11వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్వామి కల్యాణంలో పాల్గొనదలిచే భక్తులు రూ.300 చెల్లించి పాల్గొనవచ్చు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో కర్ణాల వీధి



చీకటిలో మగ్గుతున్న కర్ణాలవీధి

అల్లిపురం: గత పదిహేను రోజులుగా 32వ వార్డు కర్ణాల వీధి అంధకారంలో ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే స్ట్రీట్ లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కుక్కలు వెంట పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. తక్షణమే వీధి దీపాలు బాగు చేయాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరి సహకారంతో ప్లాస్టిక్ నిర్మూలన



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఏయూలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. సముద్రంలో ప్లాస్టిక్‌ను పరిమితం చేయడానికి మత్స్యకారులకు ప్రోత్సాహకాలు సహా, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి విశాఖలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశుభ్రమైన, పచ్చటి భవిష్యత్తు కోసం ఐఐఎంపీ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్, డీన్ డాక్టర్ విజయకుమార్, రిజిస్ట్రార్ ద్వివేది పాల్గొన్నారు.


వెల్లివిరియనున్న.. ఆధ్యాత్మిక వైభవం



సూర్యాబాగ్ విశ్వేశ్వరస్వామి ఆలయం



పోర్టు వేంకటేశ్వరస్వామి ఆలయం



సత్యనారాయణస్వామి ఆలయం

- నేటి నుంచి నియోజకవర్గంలోని ఆలయాల వార్షికోత్సవాలు
- ఇసుకకొండ శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం
- పెళ్లికొడుకైన పోర్టు వేంకటేశ్వరస్వామి
- విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

డాబాగార్డెన్స్: నియోజకవర్గం శుక్రవారం నుంచి వారం రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి రోజున పలు దేవాలయాల వార్షికోత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా ఈ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు నిత్యారాధన, బాలభోగం, శాత్తుముర్రై సేవా కాలం, 8 గంటలకు విశేష హోమములు, వైనతేయ ప్రతిష్ఠ, 9 గంటలకు స్వామి వారి సామూహిక వ్రతములు, 11 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 7 గంటలకు సంతానార్థులకు విశేషించి వైనతేయ హోమం నిర్వహించనున్నారు. 7 ఉదయం 6 గంటలకు నిత్యపూజలు, 8 గంటలకు యాగశాలార్చన, విశేష హోమములు, సాయంత్రం 7 గంటలకు స్వామి వారి దివ్య తిరు కల్యాణోత్సవం వైభవంగా జరపనున్నారు. 8 ఉదయం నిత్య పూజలు, 8 గంటలకు సుదర్శన హోమం, సాయంత్రం 7 గంటలకు వైదిక సదస్యం, మహదాశీర్వచనం (పండిత సత్కారం), 9 ఉదయం నిత్యపూజలు, సాయంత్రం 6 గంటలకు స్వామి వారి తిరువీధి (రథోత్సవం) ఉత్సవం, విశేష హోమములు నిర్వహించనున్నారు. 10 ఉదయం నిత్యపూజలు, సాయంత్రం 7 గంటలకు దీపోత్సవం(తిరుమంగైయాళ్వారు కైంకర్యం), 11న జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఆ రోజు వేకువజాము 2 నుంచి 4 గంటల వరకు విశేష పూజలు, 7 గంటల నుంచి స్వామి వారి సామూహిక విశేష వ్రతాలు, 12 గంటలకు నారాయణసేవ, మధ్యాహ్నం ఒంటి గంటకు విశేష హోమములు, పూర్ణాహుతి, ధ్వజావరోహణం, 12 సాయంత్రం 7 గంటల నుంచి చక్రాబ్జమండలారాధన, ద్వాదశారాధన, శ్రీపుష్పయాగం, పవళింపు సేవ చేపట్టనున్నారు.

పోర్టు వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవం..

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవంలో భాగంగా గత నెల 30న పందిర రాట వేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా 6 సాయంత్రం 7 గంటలకు అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, విశేష హోమములు నిర్వహించనున్నారు. 7 ఉదయం 4 గంటలకు సుప్రభాతం, ఆరాధన హోమములు, 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 4 గంటలకు కొట్నాల ఉత్సవం, ఎదురు స్నానం, సాయంత్రం 7 గంటల నుంచి స్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 8 ఉదయం 5 గంటలకు నిత్యపూజలు, సాయంత్రం 6 గంటలకు గరుడ వాహనంపై తిరువీధి సేవ, 9 ఉదయం 5 గంటలకు నిత్య పూజలు, సాయంత్రం 5 గంటల నుంచి సదస్యం.. పండితగోష్ఠి, మహదాశీర్వచనం, 10 సాయంత్రం 5 గంటలకు స్వామి వారి తెప్పోత్సవం (ప్లవోత్సవం) పోర్టు సహాయ సహకారాలతో శ్రీదేవి భూదేవి సమేతుడైన స్వామిని మేళ తాళాలతో పైలట్ లాంచిలో అధిష్ఠింపజేసి సముద్రంపై అతి వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 7 గంటలకు కూచిపూడి ప్రదర్శన ఏర్పాటు చేశారు. 11 ఉదయం నిత్యపూజలు, సాయంత్రం 6 గంటలకు ఆరాధన, చోరోత్సవం (దొంగలదోపు), ధ్వజారోహణం, బలిహరణ, 12 ఉదయం నిత్యపూజలు, సాయంత్రం 6 గంటలకు శ్రీపుష్పయాగం, 14 మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాన్నదాన కార్యక్రమం జరపనున్నారు. 22న 16 రోజుల పండగ (పాలికా విసర్జనము)తో ఉత్సవాలు ముగియనున్నాయి. స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనదలిచే దంపతులు దేవస్థాన కార్యాలయంలో రూ.1,116 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు..

నగరంలోని సూర్యాబాగ్ మెయిన్ రోడ్డులో వెలసిన విశ్వేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా 6 సాయంత్రం విశ్వేశ్వరస్వామి, బాల త్రిపుర సుందరి అమ్మవార్ల కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించనున్నారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, మండపారాధన, త్రిశూల పూజ, సాయంత్రం ధ్వజారోహణం అనంతరం కల్యాణం జరపనున్నారు. 7 సాయంత్రం విశేష హోమములు, 8 సాయంత్రం హోమములు, సదస్యం, 9, 10 తేదీల్లో విశేష హోమములు నిర్వహించనున్నారు. 12 రాత్రి 8 గంటలకు పుష్పాంజలి సేవతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి. ఆ రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నసమారాధన చేపట్టనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం లలితా మహిళా మండలిచే లలితా, విష్ణు సహస్రనామ పారాయణం, నాట్యఝురి సంగీత నృత్యాలయ సాహితీరవళి శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేశారు.

మత్స్యకారులందరూ విద్యావంతులు కావాలి

వాడ బలిజ యువకుడి విద్యకు వాసుపల్లి రూ. 10 వేల సాయం



యువకుడికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: ప్రాణాలు పణంగా పెట్టి గంగమ్మ తల్లికి మొక్కుకుని వేటకు వెళ్లే మత్స్యకారుల పిల్లలు విద్యావంతులు కావలసిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. 34వ వార్డు కార్పొరేటర్, సౌత్ మున్సిపల్ విభాగం అధ్యక్షురాలు తోట పద్మావతి సమక్షంలో వాసుపల్లి సొంత నిధులతో రూ.10 వేల నగదును వాడ బలిజ వర్గానికి చెందిన అరిజాల యశ్వంత్ విద్యకు సాయంగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులంటే చిన్న చూపు చూసే చంద్రబాబు వారి హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. వారికి అందాల్సిన జీవన భృతి, మత్స్యకార భరోసా కూడా అర్హులందరికీ ఇవ్వలేదని వాసుపల్లి ఆరోపించారు. మత్స్యకారుల పిల్లలందరూ ఉన్నత విద్య అభ్యసించాలని కోరారు. చదువుకుంటేనే గౌరవం, ఉన్నత స్థాయికి ఎదగగలరని వెల్లడించారు. దీని కోసమే నాడు ముఖ్యమంత్రిగా జగనన్న విద్యకు పెద్ద పీట వేస్తూ, ప్రభుత్వ పాఠశాలలు ఆధునీకరించి, బడికి వెళ్లలేని పేదవాళ్లు కూడా చదువుకునేలా తల్లులందరికీ అమ్మఒడి అందించి ఆదుకున్నారన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో నీకు 15,000.. నీకు 15000.. అంటూ తల్లుల ఉసురు పోసుకుంటున్నారన్నారు. మహిళలకు ఇచ్చిన ఏ హామీ కూడా అమలు చేయలేకపోతున్నారని దుయ్యబట్టారు. అవినీతిరహితంగా 2 లక్షల 75 వేల కోట్ల రూపాయలు నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని వాసుపల్లి అన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమిటని సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కోత విధిస్తే వారి తరుపున పోరాటం చేస్తానని వాసుపల్లి వెల్లడించారు. వారికి అండగా ఉంటూ మత్స్యకారులలో అక్షరాస్యత పెంపొందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం స్టేట్ సెక్రెటరీ రీసు అనురాధ, ఎర్నమ్మ తల్లి గుడి చైర్మన్ లండ రమణ, అంబటి అప్పలరాజు, అనిల్ కుమార్, సూరిబాబు, ధనరాజు, వెంకటరమణ, జోషి, రావులమ్మ, సత్యవతమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల నిరసన



కలపాకలో బకాయి వేతనాల కోసం ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి హామీ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఉపాధి పథకం బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ కలపాక గ్రామంలో ఉపాధి కూలీలు గురువారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బకాయి పడ్డ 8 వారాల వేతనాలను వెంటనే విడుదల చేస్తూ ప్రతి కుటుంబానికి 200 పని దినాలు, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని, దీనిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బకాయి వేతనాలను వెంటనే చెల్లించనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎండ మండిపోయింది

- ఉక్కిరిబిక్కిరైన ప్రజలు
- విలవిల్లాడిన కూలీలు, రిక్షా కార్మికులు, భవన నిర్మాణ పనివారు



మధ్యాహ్నం సేదదీరుతున్న భవన నిర్మాణ కార్మికులు



తమ రిక్షాల పైనే నిద్రిస్తూ కష్టాన్ని మరచిపోతున్న రిక్షా కార్మికులు

డాబాగార్డెన్స్: ఎండ మండిపోయింది. గురువారం ఉదయం నుంచే భానుడు భగభగమన్నాడు. మధ్యాహ్నం మరింత సుర్రుమన్నాడు. వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చిన వాళ్లంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హెల్మెట్లు, స్కార్ఫ్‌లు ధరించి వాహనాలపై ప్రయాణించారు. మరోపక్క రోజంతా కష్టపడితే గానీ పూట గడవని కార్మికులు ఎండను లెక్క చేయకుండా తమ విధులు నిర్వర్తించారు. చాలా చోట్ల చెట్ల నీడలో వచ్చేపోయే వారు సేదదీరారు. ఇదిలా ఉండగా సాయంత్రం 4 గంటలకు నల్లటి మబ్బులు నగరాన్ని కుమ్మరించాయి. పెద్ద ఎత్తున ఉరుములు ఉరిమాయి. అప్పటి వరకు ఉక్కిరి బిక్కిరయిన నగర జీవి కొంత ఉపశమనం పొందచ్చన్న సంతోషంతో ఉన్నాడు. తేలికపాటి చినుకులు అక్కడక్కడ కురిసి ఆగిపోయాయి. దీంతో భూమి మరింత వేడెక్కడంతో.. అంతా విలవిలలాడారు. రాత్రి పొద్దుపోయే వరకు ఈ వాతావరణం ఇలాగే కొనసాగడం.. ఉక్కపోతతో ఇటు చంటి పిల్లలు, వృద్ధులు అవస్థలు పడ్డారు.

అకలి రుచెరుగదు.. నిద్ర సుఖమెరుగదు..

ఆకలి రుచి ఎరుగదు. నిద్ర సుఖమెరుగదు. ఈ కష్టజీవులు అందుకు మినహాయింపు కారు. కడుపు నిండిందో లేదో తెలీయదు గాని.. ఎండ వేళ కాస్త చల్లని గాలి ఒంటిని సోకితే.. తామెక్కడున్నామో కూడా తెలియకుండా, ఒళ్లు మరచి ఇలా నిద్రాదేవి ఒడిలో పవళిస్తున్నారు. ఉదయం నుంచి మిట్ట మధ్యాహ్నం వరకు మండుటెండను లెక్కచేయక నగరంలోని పలు ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు, కలాసీలు, మట్టి పనులు చేస్తున్న వారు ఇలా సాక్షి కంటపడ్డారు. బీచ్‌రోడ్డులో ఓ ఆలయం వద్ద ఇలా సేదదీరారు.

రిక్షా కార్మికుల పరిస్థితి మరింత దారుణం..

మండుటెండలకు రిక్షా కార్మికుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎండల్లో రిక్షా లాగలేక అవస్థలు పడతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలో రిక్షా లాగి పడిన కష్టాన్ని.. కాసింత ముద్ద దిగిన తర్వాత తీసిన కునుకుతో మరచిపోతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఘనంగా పర్యావరణ దినోత్సవం



33వ వార్డు ఎంజీఎం హై స్కూల్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ వసంతలక్ష్మి తదితరులు



ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

అల్లిపురం: మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి అని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం చలువ తోటలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని వార్డు సచివాలయ ఉద్యోగులు, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు తదితరులుతో పర్యావరణాన్ని కాపాడుతామని ప్రమాణం చేయించారు. అనంతరం వార్డులో ర్యాలీ చేపట్టారు.

విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎంఏ నివేదిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె. లావణ్య పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలన్నారు. దీనికి విద్యార్థినులు తమ వంతు కృషి చేయాలని అన్నారు.

ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో..

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి అధ్యక్షతన జీవ వైవిధ్యాన్ని కాపాడాలని, ప్లాస్టిక్‌ని నిరోధించాలని నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ గాంధీ బొమ్మ నుంచి డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా తిరిగి గాంధీ బొమ్మకు చేరుకుంది. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, గౌరవ సలహాదారు కోన ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

33వ వార్డులో..

శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఎంజీఎం హై స్కూల్‌లో జరిగిన పర్యావరణ దినోత్సవంలో వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు తదితరులు పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని రక్షించాలని, అందుకు అందరూ కృషి చేయాలని కోరారు.



పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న మహిళా కళాశాల ఉద్యోగులు



34వ వార్డులో ఉద్యోగులు, నాయకులతో ప్రమాణం చేయిస్తున్న తోట పద్మావతి

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబం చెంతకు..



దేవేంద్రను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

విశాఖ విద్య: మానసిక స్థితి సరిగ్గా లేక, ఇంటి నుంచి తప్పిపోయి వచ్చిన వ్యక్తిని ఎట్టకేలకు వారి కుటుంబం చెంతకు చేర్చారు. వివరాలివి.. కొన్ని రోజుల క్రితం కంచరపాలెం ఫుట్‌పాత్ మీద బట్టలు లేకుండా, మానసిక పరిస్థితి బాగాలేక తిరుగుతున్న వ్యక్తిని స్థానికుల సమాచారంతో జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని జీవీఎంసీ షెల్టర్‌కు తరలించారు. అతని ఆరోగ్యపరిస్థితి సరిగా లేనందున, కంచరపాలెం పోలీసుల సమక్షంలో స్థానిక మెంటల్ కేర్ హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. తన పేరు దేవేంద్ర అని, తనది తెలంగాణలో వేములవాడ గ్రామం అని చెప్పడంతో షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత వేములవాడలో తనకు తెలిసిన వారికి దేవేంద్ర విషయం తెలిపారు. దేవేంద్ర ఫొటోను వాట్సాప్ ద్వారా పంపించడంతో వారి కుటుంబసభ్యులు గుర్తించి, విశాఖపట్నం వచ్చారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ సహాయంతో దేవేంద్రను గురువారం మెంటల్ కేర్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేయించి అతని తల్లికి అప్పగించడంలో షెల్టర్ మేనేజర్ మమత ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తప్పిపోయిన తమ కుమారుడిని చెంతకు చేర్చినందుకు వారు మమతకు కృతజ్ఞతలు తెలిపారు.

తుది దశకు వేసవి శిక్షణ శిబిరం

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగియనుంది. 40 రోజుల శిక్షణలో భాగంగా గురువారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులుకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయాధికారి బి.సూర్యకళ తెలిపారు.

8 నుంచి అమ్మవార్ల పండగ

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువైన కనకమాంబ, నెల్లి పోలమాంబ, ఎర్నిమాంబ అమ్మవార్ల వార్షిక పండగ మహోత్సవం ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించనున్నామని శ్రీకృష్ణా ఉమా మహేశ్వర సాయిదుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8న చాటింపు, కలశ పూజ ప్రారంభం, 9న తొలేళ్ల సంబరం, అమ్మవార్లకు కుంకుమ పూజలు, లలిత సహస్ర పారాయణం జరుగుతాయని తెలిపారు. రాత్రికి బుర్రకథ ప్రదర్శన ఉంటుందన్నారు. 10వ తేదీ ఉదయం 4 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు చెప్పారు.

ఎమ్మెల్యే పల్లాకు ‘ఐఎన్‌టీయూసీ’ సత్కారం



పల్లాను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ మజ్దూర్ సంఘ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: కార్మికుల విధుల్లో ప్రతి 3 నెలలకు ఓవర్ టైం పని గంటల్ని, 75 నుంచి 144 గంటలకు వేతనాన్ని పెంచుతూ ఏపీ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల తూర్పు నావికా దళ ఐఎన్‌టీయూసీ మజ్దూర్ సంఘ్ హర్షం వ్యక్తం చేసింది. అందుకు సహకరించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గురువారం సంఘ ప్రతినిధులు సత్కరించారు. ఓవర్ టైం చట్ట సవరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని ఒప్పించేందుకు కృషి చేసిన పల్లాకు వీరంతా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, ఉపాధ్యక్షులు అల్లిపిల్లి నరసింహరాజు, కె.వెంకటేష్, హరీష్, లోవరాజు, జి.మహేష్, రవికుమార్, ఆదారి రమేష్, మళ్ల జగదీష్, కోశాధికారి పి.సురేష్, ఎంవోపీ వర్క్స్ కమిటీ సభ్యుడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.